విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : జేసీ

విశాలాంధ్ర-గన్నవరం : ఎన్నికల కోడ్ అమలులో ఉందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని గన్నవరం శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ హెచ్చరించారు. గన్నవరం తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యర్థిత్వం ఆశిస్తున్న వారు నిబంధనలు పాటించాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలని బహిరంగ ప్రదేశాలలో రాజకీయ పార్టీల పక్షాన ఉన్న ఫ్లెక్సీలు, బోర్డులు తొలగించాలని సొంతస్థలాలలో కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలంటే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, అనుమతులు లేని వారి మీద ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేస్తామని, సొంత స్థలాలలో కూడా అనుమతులు తీసుకుని రాజకీయ పార్టీల తరపున ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాట్లు చేసుకోవాలని దీనికి ఆన్‌లైన్‌లో ఎన్నికల కమిషన్ సువిధ యాప్‌ను ఏర్పాటు చేసిందని, దీనిలో రాజకీయ పార్టీలు హోర్డింగులు, ఫ్లెక్సీలు, సమావేశాలు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాలు, మైక్ ప్రచారంకి సంబంధించిన నిర్దిష్ట ప్రొఫార్మాలో దరఖాస్తులు అందజేస్తే త్వరితగతిన సింగిల్ విండోలో అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 2,76,985 మంది ఓటర్లుగా ఉన్నారని విజయవాడ రూరల్‌లో 88,111, గన్నవరం మండలంలో 73,853 మంది బాపులపాడు మండలంలో 71,481 మంది ఉంగుటూరు మండలంలో 43,540 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో సువిధ యాప్ గురించి పి.పి.టి ఇచ్చి రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పుస్తకాలను అందజేశారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తంగిరాల శ్రీనివాసరావు (టి.డి.పి), నాదెండ్ల మోహన్ (బి.జె.పి), నీలం ప్రవీణ్‌కుమార్ (వై.సీ.పీ), కళ్ళం వెంకటేశ్వరరావు (సి.పి.ఎం), సుంకర వీరభద్ర ప్రసాద్ (కాంగ్రెస్), తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయ ప్రతినిధి కొండిశెట్టి జగన్మోహన్ రావు,గన్నవరం తహసిల్దార్ ఎన్.వి.ఎస్ పవన్ కుమార్, ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్ ఏ.ఎస్.ఆర్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : ప్రసార మాధ్యమాల్లో రాజకీయ ప్రచార ప్రకటనలకు జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ముందస్తు అనుమతి తప్పనిసరని కలెక్టర్ పి.రాజబాబు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుసరించి జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశారని, ఈ కమిటీ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వటంతో పాటు చెల్లింపు వార్తలను పర్యవేక్షిస్తుందని, మీడియా ఉల్లంఘనలను గుర్తించి తగు చర్యలు తీసుకుంటుందని అన్నారు. రిజిస్టర్ కాబడిన జాతీయ రాష్ట్ర రాజకీయ పార్టీలుకానీ, వారి తరపున ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు రాజకీయ ప్రచార ప్రకటనల అనుమతి కోసం మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని, రిజిస్టర్ కానీ పార్టీలు, అభ్యర్థులు ఏడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుండి అనుమతి పొంది ప్రకటన ప్రచురించాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి అన్ని రకాల టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్వర్క్ లు, డిజిటల్ డిస్ప్లేలు, మొబైల్ నెట్వర్క్ లద్వారా ఎస్ఎంఎస్ వాయిస్ మెసేజ్ లు వస్తాయని, అలాగే సోషల్ మీడియా, ఫేస్బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్, గూగుల్ వెబ్సైట్లు, వికీపీడియా కూడా వస్తాయన్నారు. సినిమాహాల్లో, ప్రైవేట్ఎఫ్ఎం రేడియోలో ప్రచురితమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలు తప్పనిసరిగా ముందస్తు ధ్రువీకరణ పొందాలన్నారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా చేసే ప్రసారాలు ప్రకటనలు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలుగా భావించి భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు చేపడతామన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఆంధ్ర అభివృద్ధికి తిలోదకాలు వదిలి ప్రభుత్వాన్ని ఇంటికి పంపండని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పాత్రికేయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రజలను మోసం చేస్తానికి మరోసారి అవకాశం ఇవ్వమని అడగడానికి జనాల మధ్యలోకి ఏ ముఖం పెట్టుకుని వస్తున్నాడు అర్థం కావడం లేదని. ఈ రాష్ట్రాన్ని ఏ విధమైన అభివృద్ధి లేకుండా సర్వ నాశనం చేశాడని ఆయన దుయ్యబట్టారు. కృష్ణాజిల్లా, మచిలీపట్నం అభివృద్ధి జగన్ హయంలో ఏమాత్రం చెందలేదని, బందరు అభివృద్ధి గాలికి వదిలేసి ఇక్కడ నాయకులు తమ కొడుకుకు సీటు ఇప్పించుకుని అందలం ఎక్కించాలని చూసుకుంటున్నారే తప్ప ఈ ప్రాంత అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆయన విమర్శించారు. రాజశేఖర్ కు నిజమైన వారసురాలు ఒక షర్మిల నేనని, ఆమె నిబద్ధత నిస్వార్ధంతో నేడు ఆంధ్ర రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకే ప్రజలు మద్దతు ఇస్తారని ఆయన ఆయన తెలిపారు. ఈ ఐదేళ్ల పరిపాలనలో ఈ రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, దీనివల్ల నిరుద్యోగులు ఉద్యోగాలు లేక అల్లడిపోతున్నారని ఆయన అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రత్యేక హెూదా తీసుకువచ్చి ఈ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాల కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో అబ్దుల్ మతిన్, గురుకుల దీపిక, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఈఓపీఆర్‌డీపై చర్యలు తీసుకోవాలి : టీడీపీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్రంలో మే నెలలో కేంద్ర ఎన్నికలు జరుగుతున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూలు ప్రకటించినా తరుణం నుండి ఎన్నికల ప్రవర్తనా నియమాలను ఉల్లంఘిస్తూ ఎన్నికల నియమాలు తుంగలో తొక్కి లబ్దిదారులకు ఇళ్ళ స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం చేస్తూ మళ్ళీ మీరు అంతా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలం టూ ఇళ్ళు నిర్మించుకుంటే 5 లక్షల రూపాయలు ఇస్తాడని ఇఒపిఆర్‌డి శైలజాకుమారి ప్రచారం చేస్తున్నారని ఆమెపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ సునీల్ కుమార్‌కు బుధవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రభుత్వం ఇచ్చే ప్రతి సంక్షేమ పథకానికి ముఖ్యమంత్రి ఫోటోతో ఇచ్చి అదే విధంగా ఇళ్ళస్థల పట్టాలు ఇళ్ళు కానీ వగైరా అన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోతో అందచేశారని వాటిని సంబంధిత సచివాలయ అధికారులతో గ్రామ పంచాయితీ కార్యదర్శులతో సేకరించి నియోజకవర్గంలో ఇళ్ళస్థల పట్టాలు అన్ని సేకరించి ఆర్.ఓ జి బాల సుబ్రహ్మణ్యం కార్యాలయంలో జాగ్రత్త చేయాలని కోరారు. ఎన్నికల కోడ్ అయిన తరువాత లబ్దిదారులకు అందించే ఏర్పాటు చేయాలన్నారు. ప్రకటన వెలువడిన రోజునే ఎస్.ఆర్.ఐ స్కూల్‌లో వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల సమయంలో వైయస్ఆర్ పార్టీకి అనుకూలంగా ఏ విధంగా నడవాలో దిశానిర్దేశ్యం చేశారన్నారు. ఈ సమావేశానికి సదరు అధికారి ఇ.ఒ.పి.ఆర్.డి తెర వెనుక ఉండి నడిపించారని 19 వ తేది రాత్రి అవనిగడ్డ పంచాయతీ కార్యాలయంలో 8 గంటల వరకు పంచాయితీ కార్యదర్శులతో సచివాలయ సిబ్బంది, వైసీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలను వైసీపీకి అనుకూలంగా నడిచే విధంగా చెప్పారు. గతంలో ఈ అధికారిపై ఎన్నో అభియోగాలు ఉన్నాయని పలు మార్లు పత్రికల్లో ప్రతిపక్ష సర్పంచ్‌లపై వివక్షతో మాట్లాడి అధికార పార్టీకి అనుకూలంగా చేయాలి లేని పక్షంతో ఎం.ఎల్.ఏతో చెప్పించాలి అన్న సందర్భాలు కూడా అనేకం ఉన్నాయాని సదురు అధికారి శైలజా కుమారి రెండు నెలలు తక్కువగా 5 సంవత్సరాల కాలం శాసనసభ్యురాలిగా తొటి అధికారులతో ప్రవర్తించిందని శైలజా కుమారిని వేరే జిల్లాకి బదిలీ చేయాలని కోరుతూ ఈ విషయంపై పూర్తి విచారణ చేయాలని కోరారు. ఎన్నికల్లో వైయస్ఆర్ పార్టీ అభ్యర్థికి శైలజా కుమారి షాడోగా పనిచేస్తుందని ఈ విషయం సాటి అదికారులు బహిరంగంగా చెప్పలేని పరిస్థితి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల రామ్మోహన్‌రావు, మేడికొండ విజయ్, యలవర్తి చిన్న, రేపల్లె అంకినీడు, కొల్లూరి ఇమ్మానియేలు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి లో శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో వారం రోజులపాటు నిర్వహించే కల్యాణోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు తరలివచ్చిన కళాకారులతో కూచిపూడి కళకళలాడింది. బుధవారం రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారులు ప్రదర్శించిన నాట్యంశాలు రక్తికట్టించాయి. ప్రముఖనాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, డాక్టర్ చింతా రవి బాలకృష్ణల పర్యవేక్షణలో ప్రారంభమైన కళాకారుల అందెల రవళులతో కూచిపూడి పులకరించింది. కళారత్న ఓలేటిరంగమణి కుమార్తె ఓలేటి శ్రీలేఖ (హైదరాబాద్) బృందం డి వైష్ణవి, సిహెచ్ మధుమిత, ప్రవళిక ప్రణవి, అనఘ, శ్రీజ లు శివ పార్వతి లాస్యతాండవం, అమ్మ నీరాజనం, ప్రదర్శించారు.ఎస్ కే ఎన్ కళాక్షేత్రం (హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ కృష్ణకుమారి శిష్య బృందం సంవేదశ్రీ, ఆద్యశ్రీ, లక్ష్మీ సౌజన్య, మేఘన, శ్రీ విభవ, దినేశ్వరి లు పలుకే బంగారమాయెనా, బ్రహ్మాంజలి, లంబోదర శివతాండవం తిరు తిరు గంభీర, ప్రభు ప్రాణనాథం అంశాలు ప్రదర్శించారు రాధాకృష్ణ కూచిపూడి నాట్యాలయం (హైదరాబాద్) మాదాల కృష్ణప్రియ శిష్యబృందం తనుశ్రీ, శ్వేత, మయూఖ లు ధన్య కైలాసం , జయ జయ దుర్గే తరంగం, ప్రదర్శించారు శ్రీ సిద్ధేంద్ర యోగి కళానిలయం డైరెక్టర్ ఎస్.ఎం.వి సత్యభామ (విశాఖపట్నం) శిష్యురాలు వై యామిని త్యాగరాజ కీర్తన, తిల్లానాను, నాట్యాచార్యసప్ప శివకుమార్ (విజయవాడ) హేమలత, శివాష్టకం అంశం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠం ప్రధానాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి ఆధ్వర్యంలో కళా పీఠం విద్యార్థులు శ్రీవత్సల,భార్గవి, సంధ్యారాణి, అమూల్య, మౌనిక, శ్రీలత, వసుధ, నృసింహాశర్మ బృందనాట్యంగాడాక్టర్ వెంపటి చినసత్యం నృత్యం లో రూపొందిన హిందోళ తిల్లానా ప్రదర్శించిన పలుఅంశాలుతో తొలి రోజు దిగ్విజయంగా ముగిసింది. కళాకారులకు, నాట్యాచార్యులకు శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ పాలకమండలి అభినందనలు తెలిపారు.

నాక్ కమిటీ డిగ్రీ కళాశాల తనిఖీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ వి ఎస్ ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులు పాటు నాక్ పర్యవేక్షణ బృందం చైర్మన్ ప్రొఫెసర్ బాలు ,ఏ. చోపడే, మెంబర్ ఆఫ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ పర్వీస్ అత్తర్ పండిట్ మరియు ప్రొఫెసర్ హెచ్. నంజే గౌడకాలేజీని పర్యవేక్షించారు . ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి పర్యవేక్షణలో వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులసహకారంతో కళాశాలతో అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించికళాశాలకు గుర్తింపు ఇవ్వటానికి నివేదికలు సమర్పించారు. దీనిలో భాగంగానే ఆ బృందం బుధవారం కాలేజీ మౌలిక వసతులు పలు విషయాలు క్షుణ్ణంగా పరిశీలించారు. కళాశాలలోని పలు విభాగాలతో ప్రయోగశాలను పరిశీలించారు. కాలేజీలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాక్. పర్యవేక్షణ బృందం ముగింపు సభ నిర్వహించి కళాశాల, దాని భౌతిక మౌలికవసరుల గురించి మంగళ, బుధవారాలలో సేకరించిన వివరాలను గురించి సభా ముఖంగా వెల్లడించారు. నాక్.బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి మరియు అధ్యాపకులు అభినందనలు తెలిపారు . ఈ కార్యక్రమంలో కళాశాల ఐ క్యు ఏసికోఆర్డినేటర్ కేర్ మంజుల, నాక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్వి కృష్ణారావు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణమోహన్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ రూరల్ మండలం బిల్లపాడు గ్రామంలో 2రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అక్కడ నివసిస్తున్న పడమట కనకదుర్గ ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో గుడివాడ పట్టణ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు నిత్యవసరవస్తువులను అందజేశారు. బుధవారం ఈ మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యులు బియ్యం నిత్యవసరవస్తువులు వంట సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి బావిరి శంకర్ నాథ్ మాట్లాడుతూ చాలామంది రెడ్ క్రాస్ అంటే రక్తదానం చేయడమే అనుకుంటారన్నారు. ఎవరైనా ఇబ్బందులు ఉన్నప్పుడు మా సొసైటీ ద్వారా అనేక సేవ కార్యక్రమంలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మడక ప్రసాద్, ట్రెజరీ అనురాధ, పావని, సామాజికవేత్త మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను పూర్తిస్థాయిలో అమలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఎన్నికల కోడ్‌ను పూర్తి స్థాయిలో అమలు చేసి తీరుతామని పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 16 వ తేది నుండి దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలు కావడంతో పంచాయితీ పరిధిలో ఉన్న ఫ్లెక్సీలు, పార్టీ జెండాలు తొలగించి పార్టీ దిమ్మలకు తెల్ల రంగు వేసి రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేశారు. వీటితో పాటు గతంలో పార్టీల పేరు మీద, వ్యక్తుల పేరుపైన బెంచీలను, పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయగా వాటి పైన కూడా తెల్ల రంగులు వేశారు. ఇటీవల ప్రారంభోత్సవాల సందర్భంగా శిలాఫలకాలను రాజకీయ నాయకులు ఆవిష్కరించడంతో అటువంటి శిలాఫలకాలపై ఉన్న పేర్లను మూసివేస్తూ పేపర్లను అంటించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. పంచాయితీతో పాటు మండలం, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కూడా ఇదే విధంగా అమలు చేసేందుకు ఎన్నికల అధికారులు పూర్తి స్థాయిలో నిమగ్నమైయ్యారు. ప్రధాన రహదారితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం సందుల్లో ఉన్న ఫ్లెక్సీలను, పలు పార్టీల జెండాలను కూడా తొలగిస్తూ శిలాఫలకాలను మూసివేస్తూ, రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఈముసుగులు వేసే కార్యక్రమంలో నాగాయలంక మండలంలో అంబేద్కర్ విగ్రహానికి కూడా ముసుగు వేయడంతో ఎస్.సి, ఎస్.టి, పలు సంఘాలు ఆందోళన చేపట్టడంతో వెంటనే అధికారులు అప్రమత్తమై ముసుగును తొలగించి పంచాయితీ సిబ్బంది పొరపాటున ముసుగు వేశారని సద్దిచెప్పడం జరిగింది. ఎన్నికల అధికారులు మాత్రం ఎన్నికల కోడ్‌ను నూటికి నూరు శాతం అమలు చేసి తీరుతామని ఆ దిశగానే విధులు నిర్వహిస్తున్నారు.

'పది' పరీక్షలకు ఆరుగురు గైర్హాజరు

విశాలాంధ్ర-అవనిగడ్డ : 10 వ తరగతి పరీక్షలు 3 వ రోజు ప్రశాంతంగా ముగిసాయి. అవనిగడ్డలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల శ్రీ చైతన్య స్కూల్, ఎస్.ఆర్.ఐ వికాస్ స్కూల్స్‌లో 10 వ తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం పరీక్షలు జరుగుతున్న 3 వ రోజు ఇంగ్లీషు పేపర్‌కు మొత్తం 588 మంది విద్యార్థులకు గానూ 3 వ రోజు 6 గురు విద్యార్థులు పరీక్షలకు గైహాజరైనట్లు ఎం.ఇ.ఒ ఎస్ శివశంకరరావు తెలిపారు. ఎస్.ఆర్.ఐ వికాస్ స్కూల్‌లో 230 మంది విద్యార్థులకు గానూ 227 మంది హాజరై ముగ్గురు గైహాజరు కాగా , శ్రీ చైతన్య స్కూల్161 మంది విద్యార్థులకు గానూ 161 మంది , ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 197 మంది విద్యార్థులకు గానూ 194 మంది విద్యార్థులు హాజరై ముగ్గురు గైహాజరైయ్యారు.

సీనియర్ సిటిజన్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎకగ్రీవం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక వర్లబజార్‌లోని పాత ఇండియన్ గ్యాస్ కాంపెనీ సమీపంలోని తుంపూడి నాగవెంకటసాంభశివరావు స్వగృహంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ వేల్‌ఫేర్ అసోసియేషన్, వృద్ధుల సంక్షేమ సంఘం 5వ సర్వసభ సమావేశాన్ని సంఘ ఉపాధ్యక్షుడు బొగ్గవరపు తరపతయ్య అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు బొగ్గవరపు తిరపతయ్య, ప్రధాన కార్యదర్శిగా చిన్నం గంగాధరావు, ఉపాధ్యక్షులుగా దండమూడి సీతారామస్వామి, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ హన్ను, కోశాధికారిగా బోమ్మదేవర సత్యనారాయణ, అర్గనైజింగ్ కార్యదర్శిగా పీత నాగేశ్వరరావు, సభ్యులుగా తుంపూడి నాగవెంకటసాంభశివరావు, కోనా వజ్రాలు, తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT VIJAYAWADA
ACP No. 233 of 2022

Between :
Vajrankura Chit Funds Pvt. Ltd Vijayawada Branch, Rep. by It's Legal Officer Md Gouse Mohiuddin Son of Abdul Rasheed.... DISPUTANT
AND
Manaboina Revathi and others .... OPPONENTS

TO:
1) **Manaboina Revathi, (Opponents No.1) W/o Srinivasa Rao,** Resident of D.No. 30-345, Near Railway Station, Malkapatnam, Machilipatnam, Krishna District.
2) **Manaboina Srinivasulu, (Opponents No.2) S/o Chokkalingam,** Resident of D.No. 30-345, Near Railway Station, Malkapatnam, Machilipatnam, Krishna District.
3) **Thanjavooru Nageswaramma, (Opponents No.7) W/o Venkateswarlu,** Resident of D.No. 30-345, Near Railway Station, Malkapatnam, Machilipatnam, Krishna District.

(Opponents No.1, 2 and 4)

Please take notice that the above Claim Petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to **23-03-2024** for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A, Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada- 520010 to answer the claim on **23-03-2024 at 10-30 A.M.** in person, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Deputy Registrar of Chits, Vijayawada)

T.Anjaneyulu, Advocate,
Near kareem Hotel, Gandhi Nagar,
Vijayawada-3
Date of Adjournment: 23-03-2024

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT VIJAYAWADA
ACP No. 231 of 2022

Between :
Vajrankura Chit Funds Pvt. Ltd Vijayawada Branch, Rep. by It's Legal Officer Md Gouse Mohiuddin Son of Abdul Rasheed.... DISPUTANT
AND
Vatrapu Satya Reddy and others .... OPPONENTS

TO:
1) **Chappidi Kiran Kumari, (Opponents No.3) D/o Bhaskara Rao,** Resident of D.No. 19-442C, Bethavolu, Gudivada, Krishna District.
2) **Tamma Subba Reddy, (Opponents No.5) S/o Anji Reddy,** Resident of D.No.12-600, Near Municipal Hospital, Sundaraiah Nagar, Tadepalli, Guntur District.

(Opponents No. 3 and 5)

Please take notice that the above Claim Petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to **23-03-2024** for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A, Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada- 520010 to answer the claim on **23-03-2024 at 10-30 A.M.** in person, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Deputy Registrar of Chits, Vijayawada)

T.Anjaneyulu, Advocate,
Near kareem Hotel, Gandhi Nagar,
Vijayawada-3
Date of Adjournment: 23-03-2024

'పోషణ పక్వాడ'

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగే పోషణ పక్వాడా కార్యక్రమాల్లో భాగంగాఏ బాబు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని నిడుమోలుసెక్టార్ సూపర్వైజర్ అబ్దుల్. సలీమున్నీసాఆధ్వర్యంలో అయ్యంకి అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం కొనసాగించారు. ఆమె పెరటి తోటల్లో లభ్యమయ్యే ఆకుకూరలు, తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే పోషకాహార పదార్థాలు పై అవగాహన కల్పించారు. అలాగే సమీపంలోనే ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో పిల్లలతో యోగా చేయించారు.ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు అంగన్వాడీ వర్కర్లు ఎం.వెంకటేశ్వరమ్మ,బి. విశాలాక్షి, ఉపాధ్యాయుని నగరాయకుమారి తదితరులు పాల్గొన్నారు.

డీవైఈఓ పరీక్ష కేంద్రాలు తనిఖీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో భాగంగా బుధవారం శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ లోనే మొవ్వ-ఏ కేంద్రాన్ని, మొవ్వ-బి కేంద్రాన్ని, గుడివాడ డివైఈవోపద్మారాణి తనిఖీలు నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం నుంచిమొవ్వజిల్లా పరిషత్ హై స్కూల్ లో, మొవ్వహెూలీ స్పిరిట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కొనసాగుతున్న ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షా కేంద్రాలను సైతం ఆమె పరిశీలించారు. కాగా బుధవారం పరీక్షలకు మండలంలోని ఏడు కేంద్రాల్లో పదిమంది విద్యార్థులు గైర్హాజరైనారు.

శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు గుడివాడ రూరల్ సిఐ ఏసుబాబు పేర్కొన్నారు. రానున్న సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ ఆదేశాలతో గుడ్లవల్లేరు పోలీసులు బుధవారం మండల పరిధిలోని వివిధ ప్రాంతాలలో సాయుధ పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ రూరల్ సిఐ ఏసుబాబు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు, ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. యువత తమ వాట్సాప్లో, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో రాజకీయ పక్షాలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ముస్లింల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-గుడివాడ : హమ్ ఏక్ - హమారి ఆవాజ్ ఏక్ - పేరుతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, టిడిపి నియోజవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావులు మంగళవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఆత్మీయ సమావేశంలో తమను భాగం చేసిన కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, మైనార్టీ యువత, మైనార్టీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల ఏర్పాట్లుపై దృష్టి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాట్లుపై దృష్టి సారించినట్లు విజయవాడ ఆర్డీవో భవానీశంకర్ తెలిపారు. విజయవాడ తూర్పు నియోజక వర్గం రిటర్నింగ్ ఆఫీసర్ అయిన భవానీశంకర్ బుధవారం నియోజక వర్గం ఎన్నికలు సజావుగా జరిగేందుకు చేస్తున్న ఏర్పాట్లును భాగంగా వివిధ శాఖల అధికారులతో కలిసి ఎస్ఎస్ఎం స్కూల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్, నిర్మా కాలేజీ రిసెప్షన్ సెంటర్లులో చేస్తున్న ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్‌కు ముందు పోలింగ్ రోజున, పోలింగ్ తరువాత ప్రణాళిక ప్రకారం తీసుకోవాల్సిన చర్యలు పటిష్టంగా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌లు మహేష్, సత్యవతి, ఏసీపీలు భాస్కరరావు, రత్నరాజు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : గురువారం సా॥ 6:23
సహరి : శుక్రవారం ఉ॥ 4:52

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

సమాచారం కోసం మీడియా సెంటర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : వచ్చే సాధారణ ఎన్నికల సమగ్ర సమాచారాన్ని ప్రసార మాధ్యమాలకు అందించేలా మీడియా సెంటర్ ఏర్పాటు చేసేలా ఏర్పాట్లు ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు పౌర సంబందాల శాఖ అధికారులకు సూచించారు. స్థానిక డీఐపీఆర్‌వో కార్యాలయంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మీడియా సెంటర్ ఏర్పాటుకు జరుతున్న ఏర్పాట్లును కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబందించి షెడ్యూల్ నేపథ్యంలో ఈసీఐ సూచనల మేరకు ఎన్నికల సమగ్ర సచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు అందించాల్సిన అవసరముందన్నారు. మీడియా సెంటర్ ద్వారా ఎన్నికలకు సమాచారాన్ని మీడియా ప్రతినిదులకు సకాలంలో అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ఏడు నియోజక వర్గాలు, ఒక పార్లమెంట్ నియోజక వర్గానికి నిష్పక్షపాతంగా, స్వేచ్చాయుతంగా ఎన్నికల నిర్వాహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించటంలో ప్రసార మాధ్యమాల సహకారం ఎంతో అవసరమన్నారు. జిల్లాలో నియోజక వర్గాల మ్యాప్‌లు, ఓటర్ల వివరాలు, పోలింగ్ స్టేషన్ల వివరాలు, ఎన్నికల అధికారుల వివరాలను ప్రత్యేక బోర్డుల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా రూపొందించిన నివేదిక సమాచారాన్ని మీడియా సెంటర్లులో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయాల మార్గదర్శకాల మేరకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి మీడియా సెంటర్ ద్వారా నాణ్యమైన సేవలు అందించి ఎన్నికలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో శ్రీనివాసరావు, డీఐపీఆర్‌వో సురేంద్రనాథ్, డీపీఆర్‌వో మోహనరావు, అడిషనల్ పీఆర్‌వో రవి, ప్రచార సహాయకులు ప్రసాద్; కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారిక భాషను అమలు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రోజువారీ అధికారిక పనిలో హిందీని అమలు చేయడానికి అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల పూర్తి బాధ్యతను తీసుకోవాలని డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) నరేంద్ర ఎ పాటిల్ పునరుద్ఘాటించారు 186వ డివిజనల్ అధికార భాషా అమలు కమిటీ(డోలిక్) సమావేశం బుధవారం డివిజనల్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఆర్ఎం మాట్లాడుతూ డివిజన్ అధికారులు,సిబ్బంది అధికారిక అనువాదాలలో సహాయం కోసం 'కాంతస్థ్ యాప్'ను వెబ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలని కోరారు.అధికార భాషా విధానం లక్ష్యాలను అధిగమించినందుకు అభినందించారు.30% ఉన్న 'నోటింగ్స్' లక్ష్యం డివిజన్‌కు 83.02% ఆశాజనకంగా ఉందని, అదేవిధంగా హిందీలో అందుకున్న ఉత్తరప్రత్యుత్తరాల కోసం హిందీలో సగటున 83.4% ప్రత్యుత్తరాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. జాతీయ సమగ్రత కోసం అధికార భాష అమలు ప్రాముఖ్యతపై వివరించారు.రోజువారీ పనిలో అధికార భాష అమలులో విజయవాడ డివిజన్ హిందీ విభాగం కృషిని ప్రశంసించారు.ఈనెల 15న ఉదయపూర్‌లో జరిగిన ఆల్ ఇండియా రైల్వే నేషనల్ హిందీ డ్రామా పోటీలో విజయవాడ డివిజన్ బృందం మొదటి స్థానంతో సహా 15 బహుమతులలో 8 గెలుచుకున్నందుకు వారని అభినందించారు. దీనికి ముందు విజయవాడ డివిజన్ రాజభాష అధికారి ఆశా మహేష్ కుమార్ ప్రజెంటేషన్ ద్వారా అధికార భాష అమలులో ఈ డివిజన్ సాధించిన ప్రగతిని వివరించారు. రాజభాష యొక్క వివిధ అమలు అంశాలపై,అధికార భాషా విధానం కోసం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో సమన్వయం చేసినందుకు అధికారులు,సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఏడిఆర్‌మ్‌లు ఎమ్.శ్రీకాంత్ (ఆపరేషన్స్),పితఃఎడ్విన్ (మౌలిక సదుపాయాలు), ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్మృతి వనం సందర్శన వేళలు మార్చాలి

విశాలాంధ్ర-విజయవాడ : విజయవాడ నడిబొడ్డున ఎంతో సుందరంగా అంబేద్కర్ స్మృతి వనాన్ని ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసింది. ఆ పార్కును సందర్శించటానికి ఆసక్తిగా జనం వస్తున్నారు. కానీ సందర్శన వేళలు అనుకూలంగా లేకపోవడంతో సందర్శకులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పార్కులోకి అనుమతించేందుకు టిక్కెట్ ధర అందరికీ అందుబాటులో ఉన్నా చూడటానికి వెళ్లిన వారిని అక్కడ సిబ్బంది సాయంత్రం 7.30 గంటలకే సమయమైపోయిందంటూ పంపుతున్నారు. అడిగితే మా పని గంటలు సాయంత్రం 5 గంటల వరకే... అనుమతి ఉందని చెప్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం సమయంలో పార్కును చూడటానికి అందరికీ సాధ్యం కాదు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, గృహిణులు నిత్యం ఒత్తిడితో ఉంటారు. సరదాగా తమ కుటుంబాలతో గడపటానికి వెసులు బాటు సమయం సాయంకాలమే. సాయంత్రం కనీసం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు తెరిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని సందర్శకులు పేర్కొంటున్నారు. అక్కడ పనిచేసే సిబ్బందిని షిఫ్టులుగా విభజించి నియమించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులకు మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర-మైలవరం: యల్.బి.ఆర్.సి.ఇ యన్.యస్.యస్.యూనిట్ ఆధ్వర్యంలో కనిమెర్ల తండాలో వారం రోజుల స్పెషల్ క్యాంపులో భాగంగా ఐదవరోజు (బుధవారం) స్కూల్ విద్యార్థులకు ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైలవరం ప్రభుత్వ వైద్యశాల చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రమ్య విచ్చేసి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి కృషి చేయాలని, భోజనం చేసే సమయంలో, ఇతర పదార్థాలు తినే సమయంలో చేతులు శుభ్రంగా ఉండాలని, పరిశుభ్రంగా ఉంటూ పౌష్టిక మైన ఆహారాన్నితీసుకొంటే రోగాలు దరి చేరవు అని అలాగే చిన్న పిల్లలు ఎండా కాలంలో ఆరోగ్యంగా ఉండటానికి అవసరమైన చిట్కాలు తెలిపి, 95మంది పిల్లలను పరీక్షించి, మందులను పంపిణి చేసారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు ప్రసంగిస్తూ విద్యార్థిని, విద్యార్థులు పరిశుభ్రమైన వాతావరణంలో ఉండాలని,ఆరోగ్యం నందు వ్యక్తిగత శ్రద్ధ కనపరచాలని, కాచి చల్లార్చిన నీరు తాగడం వలన అనారోగ్యం దరిచేరదని, పౌష్టికాహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. అదేవిధంగా యన్.యస్.యస్ ప్రోగ్రాం అధికారి డా.బి.శివహరిప్రసాద్ మాట్లాడుతూ తమ యన్.యస్.యస్ యూనిట్ ఎల్లప్పుడూ ప్రజలను చైతన్య పరిచేలా వివిధ రూపేణ అవగాహన సదస్సులు మరియు వివిధ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు, స్కూల్ పిల్లలకు వైద్య శిబిరంను నిర్వహించినందుకు స్కూల్ ఉపాధ్యాయులు కళాశాల మేనేజ్మెంట్ కు, యన్.యస్.యస్ ప్రోగ్రాం అధికారి డా.బి.శివ హరి ప్రసాద్ కి, యన్.యస్.యస్. వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో ఎన్.యస్.యస్. ఇన్ ఛార్జ్ శ్రీ.ఎస్.ఉమామహేశ్వర రెడ్డి, వివిధ విభాగాల యన్.యస్.యస్. ఇన్ ఛార్జ్ లు మరియు యన్.యస్.యస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

మేమున్నామని భరోసా కల్పించేందుకే పోలీసుల కవాతు : సీఐ

విశాలాంధ్ర- కంచికచర్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు మేమున్నా మని భరోసా ఇచ్చేందుకు పోలీసులు కవాత్ (ఫ్లాగ్ మార్చ్) నిర్వహిస్తున్నామని రూరల్ సీఐ చంద్రశేఖర రావు తెలిపారు. కంచికచర్ల మండలం గండేపల్లి కీసర పెండ్యాల గ్రామాల లో పారా మిలటరీ దళాలు స్థానిక పోలీసు లతో కలిసి కవాత్ చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రానా టాటా ఆదేశాల మేరకు ఏసిపి రవి కిరణ్ సారథ్యం లో సమస్యాత్మక మైన గ్రామాలను గుర్తించి పోలీస్ కవాత్ నిర్వహించడం జరుగుతుంద ని తెలిపారు. గత ఎన్నికల్లో దాడులు ప్రతి దాడుల్లో అదుపులో తీసుకున్న వారిని బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల ఎస్ఐ సుబ్రహ్మణ్యం ఎస్సై 2 హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే ప్రధాన ఎన్నికల ఎ జెండా

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రానున్న ఎన్నికల్లో ప్రజా సమస్యలే ప్రధాన ఎన్నికల ఎ జెండాగా ముందుకు వెళ్ళ తున్నామని థర్డ్ ఫ్రంట్ నాయకులు స్పష్టం చేశారు.బుధవారం గాంధీనగర్‌లోని ఇండియాన్ ప్రజా కాంగ్రెస: పార్టీ కార్యాలయంలో థర్డ్ ఫ్రంట్ పార్టీలు అయిన ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ,మన రామ రాజ్యం పార్టీలు కలసి ప్రజా సోషలిస్ట్ కూటమి నాయకులు సమావేశం అయ్యి భవిష్యత్తు కార్యచరణపై చర్చించారు.ముఖ్య అతిథులుగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కె.బి శ్రీధర్,మన రామ రాజ్యం పార్టీ జాతీయ అధ్యక్షులు మావులేటి ధనేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం సమాజంలో పరిస్థితులు ఏమి బాగాలేవని రెండు కుటుంబాల చేతిలో అధికార మార్పిడి ఉండటం వలన ఉందని ప్రజలు మరింత పెదలుగా మారిపోతున్న పరిస్థితులు చూస్తున్నామని దాంతో మూడో ప్రత్యామ్నాయం రావలసి అవసరం ఉందన్నారు.రాష్ట్రంలో రెండు కుటుంబాలు ఆదిపత్యంలో ఉంటున్నాయని నాలుగు పార్టీలు రెండు కుటుంబాలని ఇది దౌరభాగ్య పరిస్థితి అన్నారు. ప్రజలు గత్యంతరం లేక పెత్తందారులకు ఓట్లు వేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రకుల పేదలుకు అనుకూలంగా 3వ ప్రత్యామ్యమయం ఏర్పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామన్నారు.అన్ని నియోజకవర్గాలలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకొని త్వరలోనే ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పద్మాకర్ ఐజాక్,రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి మహేష్, అంజనీదేవి. గోగిరెడ్డి.నామని. భాస్కర్ ఎల్.జయబాబు,జనతా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పావని,జాతీయ కార్యదర్శి కట్టా రమేష్, బాలాజీ,తదితరులు పాల్గొన్నారు.

సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకుంటాం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ముజావారుల కమిటీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలంటూ తాము చేసిన డిమాండ్‌కు రంజాన్ అనంతరం సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకుందామని తమ కమిటీ మాజీ అధ్యక్షులు హామీ ఇచ్చారని ముజావారుల కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ అన్సారీ తెలిపారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముజావారుల కమిటీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలంటూ ఈ నెల 16వ తేదీన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిటీ అధ్యక్షుని పేరు సయ్యద్ అల్తాఫ్ అని తాను ప్రస్తావిస్తే పత్రికలలో పొరపాటుగా అల్తాఫ్ రజా అని ప్రచురితమైందన్నారు.మా కమిటీతో సంబంధంలేని అల్తాఫ్ రజా పేరు ప్రచురితమవ్వడం బాధాకరమని అందుకు చింతిస్తున్నట్లు తెలిపారు.

జీఈసీ విద్యార్థులకు వర్క్ షాప్

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శేషాద్రి రావు నాలెడ్జ్ గ్రామములోని ఎస్ ఆర్ జి ఈ సీ కళాశాలలోని ఐటీ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఏపి. ఎస్. ఎస్. డి. సి వారి సౌజన్యంతో శ్రీమతి వై. రేవతి గారిచే విద్యార్థులకు కంప్యూటర్ ఆటలను ఎలా తయారు చేయాలో ఎలాంటి మెలుకువలు పాటించాలో అనే అంశంపై వారం రోజులు వర్క్ షాప్ ను నిర్వహించారు. మార్చి నెలలో మొదటి వారం మొదటి విడతగా ద్వితీయ సంవత్సర విద్యార్థులకు గేమ్ డెవలప్మెంట్ యూజింగ్ యూనిటీ(సి హాష్) అనే ప్రోగ్రామును విజయవంతంగా ముగించుకొని, మలివిడుతగా మొదటి సంవత్సర విద్యార్థులకు ఆన్లైన్ గేమ్స్ డిజైనింగ్ అండ్ క్రియేటివిటీ పై ఆసక్తి నెలకొల్పడానికి మరో మూడు రోజులు 20 నుండి 22 మార్చి తేదీలలో గేమ్ డిజైనింగ్ యూజింగ్ బిల్డ్ బాక్స్ నిర్వహించారు. ఈ రెండు వర్క్ షాపులను నిర్వహించిన ఏపి. ఎస్. ఎస్. డి. సి బోధకురాలు వై. రేవతి ఈ అవకాశాన్ని తనకు ఇచ్చిన కళాశాల యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు..ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ.టి. విభాగాధిపతి డాక్టర్ డి. ఎస్. వి. ఎస్. ఎల్. ఎస్. ఇందిరా, ఆ విభాగపు సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. రాజారావు మరియు ఏపీ. ఎస్. ఎస్. డి. సి. కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్. సురేష్ బాబు విద్యార్థులకు ఇలాంటి డెవలప్మెంట్ టెక్నాలజీస్ మున్ముందు మరెన్నో నేర్చుకోవాలని దిశా నిర్దేశం చేశారు.

మజ్జిగ, మంచినీరు, బ్రెడ్ పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : వేసవిలో పాదచారులకు, వాహన చోదకులకు చల్లపల్లి బంగళా సమీపాన వాసవి క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ కపుల్స్ ఆధ్వర్యంలో మంచినీరు, మజ్జిగ, బ్రెడ్ పంపిణీ జరిగింది. మంచినీరు, మజ్జిగ చలివేంద్రం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అంతర్జాతీయ వాసవి క్లబ్ ల పూర్వ అధ్యక్షుడు డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా చేతుల మీదుగా మంచినీరు, మజ్జిగ పంపిణీ జరిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు తీవ్రతరంగా మారుతున్న సమయంలో మంచినీరు, మజ్జిగ కాకుండా బ్రెడ్ కూడా పంపిణీ చేయడం క్లబ్ సేవలు ప్రశంసించదగినవన్నారు. ప్రతి వ్యక్తి కుల మతాలకతీతంగా సమాజ సేవలో భాగస్వాములు కావాలని అప్పుడే సామాజిక అభివృద్ధి సాధ్యమని, దాతలకు పుణ్యఫలం లభిస్తుందన్నారు. క్లబ్ అధ్యక్షురాలు విజయలక్ష్మి మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించగా గౌరవ అతిథులుగా గవర్నర్ వాసవియన్ గణేష్, రామచంద్ర రాజా, వైస్ గవర్నర్ సాయి సునీత, ప్రభాకరరావు, కార్యదర్శి శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'కలియుగం పట్టణం'లో చిత్ర బృందం సందడి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: నగరంలో కలియుగం పట్టణంలో చిత్ర బృందం సందడి చేసింది. క్రైమ్, థ్రిల్లర్ ,లవ్, మదర్ సెంటిమెంట్ తో కలియుగ పట్నంలో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఆ చిత్ర కథానాయకులు విశ్వ కార్తికేయ, హీరో నరేన్ రామ్ తెలిపారు.కలియుగం పట్టణంలో చిత్రం ప్రమోషన్‌లో భాగంగా మురళి ఫార్చ్యూన్ రోడ్ లోని ఒక హొటల్లో చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా కథానాయకుడు విశ్వ కార్తికేయ మాట్లాడుతూ కనకదుర్గమ్మ దర్శనంతో తమ చిత్రం ప్రమోషన్ ప్రారంభించామని కళాశాల విద్యార్థులతో తమ చిత్ర విశేషాలు ముచ్చట్టించిన సమయంలో వారి నుంచి వచ్చిన స్పందన ఎంతో సంతోషంగా ఉందన్నారు .క్రైమ్, థ్రిల్లర్, లవ్ ఎలిమెంట్స్ తో చిత్రం ఉంటుందన్నారు.బాల నటుడిగా ఎన్నో చిత్రాలలో నటించాననీ చెప్పారు.ఎన్నో క్రైమ్ సినిమాలు వచ్చి ఉంటాయి కానీ వీటన్నిటికీ విభిన్నంగా ఈ సినిమా ఉంటుందన్నారు.మార్చి 29న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుందనీ ,ప్రేక్షకులందరూ ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. అనంతరం దర్శకుడు రమణ కాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రం క్రైమ్, థ్రిల్లర్ ,లవ్, మదర్ సెంటిమెంట్ తో ఉంటుందన్నారు.ఈ చిత్రాన్ని చాలెంజింగా తీశాననీ,ఈ చిత్రంలో ఉన్న క్రైమ్ సన్నివేశాలు యువత ఎవరు ఇన్స్పిరేషనల్ గా తీసుకోవద్దన్నారు.కేవలం చిత్రం కోసం మాత్రమే కల్పిత పాత్రలు, వాటిని ఎవరు ఫాలో అని మనవి చేసుకుంటున్నను అన్నారు.ప్రేక్షకులు అందరూ థియేటర్ల వద్దకు వచ్చి చిత్రాన్ని ఆదరించాలని కోరారు. అనంతరం హీరోయిన్ ఆరుషి మాట్లాడుతూ ఈ చిత్రంలో తన క్యారెక్టర్ ప్రేక్షకులను కచ్చితంగా నచ్చుతుందన్నారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయం చేసి ఆదరించాలని ఆమె కోరారు విలేకరుల సమావేశంలో చిత్ర నిర్మాత మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ సమస్యలు అధిగమించేందుకు ఏఆర్సీ ఫార్మ్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ వ్యవసాయ శాస్త్రాల సంస్థ ఎఫ్ఎంసీ ఇండియా రైతులకు పంట దిగుబడి పెంచడంతో పాటు, అన్ని విధాలా సహాయం చేసేందుకు తమ వినూత్న ఖచ్చితత్వ వ్యవసాయ ప్లాట్‌ఫారమ్ ఏఆర్సీ ఫార్మ్ ఇంటెలిజెన్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా ఎఫ్ఎంసీ ఇండియా ప్రాంతీయ అధ్యక్షులు రవి అన్నవరపు మాట్లాడుతూ ఈ కొత్త యాప్ ద్వారా రైతులు, సలహాదారులు ఛానెల్ భాగస్వాముల కోసం తెలివైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్న మన్నారు. రైతులు దిగుబడిని మెరుగు పరుచుకోవడానికి పెట్టుబడిపై అధిక రాబడిని సాధించడానికి సిఫార్సు చేయబడిన పంట సంరక్షణ ఉత్పత్తుల యొక్క ఖచ్చితమైన వినియోగాన్ని నిర్ధారించుకోవచ్చునన్నారు. నేటి సంక్లిష్టమైన రోజు రోజుకి పెరుగుతున్న వ్యవసాయ సమస్యలను అధిగమించే సమయంలో రైతులు క్షేత్ర స్థాయిలో ప్రతిరోజూ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, ఏఆర్సీ టీఎం ఫార్మ్ ఇంటెలిజెన్స్, రైతులకు వన్ స్టాప్ సొల్యూషన్, మరింత ప్రభావవంతమైన సమర్థవంతమైన పంట సంరక్షణ కోసం రియల్ టైమ్ క్షేత్రస్థాయి పరిజ్ఞానం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడంలో వారికి మద్దతు ఇస్తుందన్నారు. తద్వారా వారికి మెరుగైన ఖచ్చితత్వం, ఉత్పాదకత లాభదాయకతను అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోషణ పఖ్వాడ్ పక్షోత్సవాల అవగాహన

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణంలోని 18వ వార్డు అంగన్వాడీ కేంద్రం నుండి కొలా వారి ప్రభుత్వ ఆసుపత్రిలో పోషణ పఖ్వాడ్ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని గర్భిణీలు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కమ్యూనిటీ బేస్డ్ ఇవ్వెంట్ ప్రోగ్రాంలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ అళ్ళ హరీష్, డా.అరుణా,ఏయన్.యం షేక్ షాహీరా బేగం, అంగన్వాడీ కార్యకర్త దుడకా సీతామహాలక్ష్మి,ఆశా వర్కర్లు సిరాజున్నీసా, అంజమ్మలు మరియు గర్భిణీ, బాలింతలు పాల్గొన్నారు.

23 నుంచి వేణుగోపాల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-గంపలగూడెం : నెమలి వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి నూతక్కి. వెంకట సాంబశివరావు ,ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కావూరి. శశిరేఖ లు తెలియజేశారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 23వ తేదీ అంకురార్పణ (పెండ్లి కుమారుని చేయుట) ,24వ తేదీ శేషవాన మహోత్సవం, 25వ తేదీ శ్రీ వేణుగోపాల స్వామి వారి కళ్యాణ మహోత్సవం ,26వ తేదీ రథోత్సవం ,27వ తేదీ పల్లకి ఉత్సవం (వసంతోత్సవం), 28వ తేదీ పవళింపు సేవ కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి. గోపాలచార్యులు ఆధ్వర్యంలో ఉత్తమ వేద పండితులు పరాశరం. వికనా సాచార్యుల బ్రహ్మత్వంలో స్వామివారి కళ్యాణ మహోత్సవం, ప్రత్యేక పూజలు, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి నూతక్కి. వెంకట సాంబ శివరావు ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కావూరి. శశిరేఖ తెలిపారు.

వైసీపీతోనే సంక్షేమ పథకాలు అమలు : ఉప్పాల

విశాలాంధ్ర-కృత్తివెన్ను : తీర ప్రాంతాల్లో వైసిపి పెడన అభ్యర్థి ఉప్పాల రాము విస్తృతస్థాయిలో ప్రచార నిర్వహిస్తున్నారు. బుధవారం ఆయన జడ్పీ చైర్మన్ ఉప్పాల హారికతో కలిసి ఇంటింటికి తిరిగి తమకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. మరొకసారి జగన్ మోహన్ రెడ్డికి అవకాశం ఇస్తే పేద బడుగు బలహీన వర్గాలకు మరింత సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఒర్లగొందితిప్ప, పల్లిపాలెం గ్రామాలకు సంబంధించిన 40 కుటుంబాల వారు వైసిపి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, జడ్పిటిసి సభ్యురాలు మైలా రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధరరావు, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ వైధాని వెంకటరాజు, సర్పంచ్ కొల్లాటి రాజు, ఆకన సాయి, కొక్కిలగడ్డ బాపూజీ, పిఏసిఎస్ అధ్యక్షులు రేవు నరసింహారావు, పట్టపు నాని, ఈడా కిషోర్, పులగం రాము, జన్యావుల రఘునీ, జల్లా భూపతి, తిరుమాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ఆహార నియమాలు పాటించాలి

విశాలాంధ్ర-విజయవాడ: సరైన ఆహార నియమాలు అవలంభించడం ద్వారా వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని జీర్ణకోశ వైద్య నిపుణులు చింత వీర అభినవ్ సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం సాయంత్రం స్థానిక బందరు లాకులు వద్ద ఉన్న సంఘం కార్యాలయం నందు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న అభినవ్ జీర్ణకోశ వ్యాధుల పై మాట్లాడుతూ మానవ శరీరం కేవలం శాఖాహారం కోసమే నిర్మాణం అయి ఉంటుందని జీవన శైలి లో అనేక మార్పులు వల్ల చిన్న వయస్సులోనే అనారోగ్యంకు గురవుతూ ఉన్నారని అవేదన వ్యక్తం చేశారు. మలబద్ధకం, అజీర్తి, మధుమేహం వంటి సమస్యలు వస్తాయని, అధికంగా ఉప్పు,కారం మసాలాలు, నూనె పదార్థాలు , లేకుండా పీచు పదార్థాలు, పోషకాలు ఉంటే ఆహారం మితంగా తీసుకోవాలని, నిత్యం నడక, వ్యాయామం చేయాలని సూచించారు. పిల్లల వైద్య నిపుణులు చలసాని అనూష మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు నెలలు నిండకుండానే ప్రసవం జరుగుతూ ఉన్నాయని ఇటువంటి పసి పిల్లల సంరక్షణ కోసం ఇటీవల నూతనంగా ప్రారంభించిన లిటిల్ చాంప్స్ చిల్డ్రన్స్ హాస్పిటల్ నందు ఆధునిక వైద్యం అందిస్తూ ఉన్నామని వివరించారు. సీనియర్ న్యాయవాది చలసాని అజయ్ కుమార్ వృద్ధులకు పలు న్యాయ సమస్యలు మీద వివరించారు. సంఘం అధ్యక్షులు వేమూరు బాబురావు,కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికల్లో 85 యేళ్ళ పై బడిన వృద్ధులు ఇంటి వద్దనే ఓటు వేసే సదుపాయం ఉందని అందుకోసం ముందుగానే ఫారం డి పూర్తి చేసి అధికారులకు ఇవ్వాలని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కే వి వి పరమేశ్వరరావు సంఘం సహాయ కార్యదర్శి డి సాంబశివరావు, నాదెళ్ల సుమతి , సామాజిక కార్యకర్త అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT VIJAYAWADA
ACP No. 126 of 2022

Between :
Vajrankura Chit Funds Pvt. Ltd Vijayawada Branch, Rep. by It's Legal Officer Md Gouse Mohiuddin Son of Abdul Rasheed.... DISPUTANT
AND
Kornala Umamaheswara Rao and others .... OPPONENTS
TO: **Addanki Raju, (Opponent No.4) S/o John Kotaiah,** Resident of D.No. 41-26/1-9, Gunturu Vari Street, Krishna Lanka Vijayawada-13
(Opponents No.4)

Please take notice that the above Claim Petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to **23-03-2024** for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A, Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada- 520010 to answer the claim on **23-03-2024 at 10-30 A.M.** in person, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Deputy Registrar of Chits, Vijayawada)

T.Anjaneyulu, Advocate, Near kareem Hotel, Gandhi Nagar, Vijayawada-3
Date of Adjournment: 23-03-2024